## 17. మనసైన మనువు

ఆనాడు వెంకడికి ఎంత దుర్దినం! తనుపూర్వం కట్టుకున్న గాలిమేడలన్నీ - నేల కూలాయి. తను అనుకోని విధంగా పరిస్థితులు మారాయి. తను ప్రాణప్రదంగా చూచుకొనే రామే- తన కానాడు కర్ణకఠోరవాక్యాల్ని చెప్పగలిగింది. ఆనాడు, మధ్యాహ్నం, గొడ్లు పొలంలో మేస్తూవుండగా- వెంకడు, దాపునేవున్న ఆ చింతతోపులో ప్రవేశించాడు. అక్కడ రామి కన్పించింది. వెంకడు ఆమెతో సరసమాడబొయ్యాడు.

"ఏం పిల్లా చికారొచ్చావ్?"

"ఉఁ, మా కెప్పుడూ చికార్లేగా- పనేముంది?" రామి అన్నది, మూతి తిప్పుకుంటూ.

"ఏదో ఎగతాలికంటే- అంత కోపమెందుకే?"

"మా కోపం ఎవర్నేం చేస్తుందిలే" -రామి అన్నది, చింతచెట్టు మొదట్లో చతికిలపడుతూ.

"అయితే- విశేషాలేమిటి?"- వెంకడన్నాడు, రామి పక్కనే కూచుంటూ.

"ఏమున్నాయ్? ఏం లేవ్" - రామి విషయాన్ని తేల్చేసింది.

"అబ్బ! ఏదో వొకటి చెపుదూ" -వెంకడన్నాడు, రామిబుగ్గమీద చిటికవేస్తూ.

"ఏంటీ సరసాలు" - రామి వాక్యంలో కొద్దికోపం యిమిడివుంది.

"కాబొయ్యే ఆలుమగలు సరసాలాడుకోరంటే- పిల్లా?"

"ఇంక- ఆ ఆశ వదులుకో" -రామి అన్నది వికటంగా.

వెంకడికి బుర్రగిర్రున తిరిగింది. "అదేమే?"- వెంకడు ఆదుర్దాగా అడిగాడు.

రామి, యేమీమాట్లాడకుండా, ఒక నిమిషం, బిగతీసుకు కూర్చుంది. వెంకడికి ఆదుర్దా ఎక్కువయి, మళ్లీ అదే ప్రశ్న అడిగాడు.

"నాకేం తెలీదు - మా బాబు నడుగు" - రామి చిరాకుతో ఈ మాటలు చెప్పిన వెంటనే - అక్కడ్నుంచి పరుగెత్తి వెళ్లిపోయింది.

రామి చెప్పిన మాటలోని అర్థం- వెంకడి కేమీ తెలియలేదు. ఏమై వుంటుందోకూడా - వెంకడు వూహించ లేకుండా వున్నాడు. తను బాబును ఏం అడగాలి? ఆ విషయం, అడిగాక కాని తెలియదు. అసలు రామి బాబు దగ్గరకు వెళ్తేనేకాని- ఆ సంగతేమిటో తెలియదు. వెంకడికి ఏమీ తోచక చింతచెట్టు పైకి చూచాడు. చింతచెట్టు మీది కాకి, ప్రతిధ్వనించేటట్లు 'కా' అని కూసింది.

## 2

వెంకడి మనసు మనసులో లేదు. అసలు విషయం ఏమిటో అర్థంకాక, వెంకడు వ్యాకులపడ్డాడు. సాయంత్రం నాలుగు గంటలకే గొడ్లను కరణంగారి యిల్లుజేర్చి, అయిదు గంటలకల్లా అక్కడి పని పూర్తిచేసుకొని- వెంకడు రామి యింటి వైపు బయలుదేరాడు- బరువైన హృదయంతో.

రామి తండ్రి - బైరాగి, గుడిసెకు ముందు భాగంలో కూర్చొని చుట్ట కాల్చుకుంటున్నాడు. వెంకడ్ని చూచి, బైరాగి ముఖం కొద్దిగా ముడిచాడు. వెంకడి కిది చాలా కష్టంగా తోచింది. కాని ఏమనేందుకూ వీలులేక వూరుకున్నాడు.

"నమస్కారాలు- బైరాగి మామా!"

వెంకడు బైరాగికి నమస్కరించాడు!

"ఏరా-అల్లుడా- ఇల్లా కూకో" - బైరాగి అన్నాడు, తన ప్రక్కనే స్థలం చూపుతూ. వెంకడు బైరాగి పక్కనే కూర్చున్నాడు.

"ఏరా-ఏం పనిమీదొచ్చావ్?"

"ఏం లేదు మామా! ఒక్క విషయం కనుక్కుందామని వచ్చా."

"ఏంటి-చెప్పు" - బైరాగి వెంకడి ముఖంలోకి చూస్తూ అడిగాడు.

"మామా! రామిని పెళ్ళాడాలనివుంది"-

"ఎంకా! రామిని నీ కిద్దామనే వుందిరా- కాని..." బైరాగి నీళ్లు నమిలాడు.

"కానీ...? నీ అనుమానాన్ని చెప్పు మామా!" వెంకడు, బైరాగి చెప్పేదానికి నిరీక్షిస్తున్నాడు.

"ఒక్క సంగతి చెప్తా విను- ఎంకా! రామి తల్లిలేని పిల్లగదా! పిల్లకు పెళ్ళీడుకూడా వచ్చింది, దాన్ని నీకిద్దామనే వుందిరా- ఇంక, నీ వైపు చూడబోతే ఎవ్వరూ లేరుగదా! పోనీ నువ్వే దాన్ని చూత్తావనుకుందాం. ఏదెలాగున్నా, రామికి సొమ్ములమీద మా చెడ్డ మనుసుందిరా. నువ్వు రెండొందల రూపాయిలు సొమ్ములు దాని కెడితే- నీకిచ్చి పెళ్లిచేసేందుకు అభ్యంతరం లేదురా- ఎంకా!"

బైరాగి చెప్పిన మాటలకు వెంకడికి ముచ్చెమటలు పోశాయి. బైరాగి రామిని తనకిచ్చేందుకు ఇష్టంలేక యీ కొత్తఎత్తు ఎత్తేడేమోననే సందేహం ఒక వైపూ- లేక రామే తనను పరీక్షించేందుకు యీ వ్యూహాన్ని పన్నిందేమోననే అనుమానం మరోవైపూ- వెంకడ్ని పీక్కుతిన్నాయి.

"మామా! కరణంగోరు- కూడెట్టి సంవత్సరానికి ఇరవై రూపాలిస్తారు. రామిని పెళ్ళాడాక- అదీ నేను కూడా కరణంగోరింట్లో పనిచేసుకు జీవిస్తాం. నగలేం చేసుకుంటుంది మామా?"

"ఏమోరా - రెండు వందలూ ఇత్తామని మరో మను వొచ్చింది. నీకు మాటిచ్చానుగదా అని చెప్పాను. ఆ తరువోత - నీ యిష్టం."

"మామా! నా దగ్గరకూడా డబ్బేం లేదు. ఇన్నాళ్ళూ కరణంగోరిచ్చింది అప్పులకింద సరిపడ్డది. పోతే కిందటి రెండేళ్ళూ దాచుకొన్న యాభైరూపాయిలూ వారి దగ్గరున్నాయి. అది పెట్టి దానికి సొమ్ములు చేపిత్తా మామా!"

"యాభైరూపాయిల కేం సొమ్ము లొస్తాయిరా? ఎబ్బే! అదేం కుదరదు- ఇవ్వదలచుకుంటే రెండొందలూ తెచ్చివ్వు- ఎక్కడ ప్రాప్తముందో అక్కడే అవుతుంది. ఆలోచించుకో-"

వెంకడికి ఏమీ పాలుపోలేదు. ఆలోచించదగ్గ విషయం కూడా ఏమీ లేదు. వెంకడికి బైరాగి మీద పట్టరాని కోపం వచ్చింది.

"మామా! అయితే - ఇంతేనా?"

"ఏరా బెదిరిత్తావా? ఒక నెలరోజుల్లో - రెండువందలూ తెచ్చి రామి విషయం మాట్లాడు. లేకపోతే మాట్లాడకుండా ఇక్కడ్నుంచి సదురుకో"- బైరాగి కచ్చితంగా చెప్పేసి గుడిసెలోనికి వెళ్ళాడు.

వెంకడు తన బరువైన బొందితో లేచి నిలబడ్డాడు. గుడిసెవైపు ఒకసారి చూచాడు. రామి తనవంక అర్థంలేని చూపులతో చూసి వెకిలి నవ్వొకటి నవ్వింది. వెంకడికి చాలా కష్టంగా తోచింది. వెంకడికి ఆప్రదేశంలో ఇంకొక్క క్షణమయినా వుండ బుద్ధిపుట్టలేదు. వెంటనే - రామి వైపైనా చూడకుండా వెంకడు వెనక్కు వెనక్కు లాగే కాళ్లతో - ఇంటి దారి పట్టాడు. వీధిలో తిరిగే నాటుకుక్కొకటి వికారంగా అరిచింది.

## 3

కుంభవర్షం కుమ్మరిస్తూవుంది. ఎడతెరిపి లేకుండా ఏనుగుతొండంలావు ధారగా పడుతోంది. చర్మాన్ని కొరుక్కు తినే చలిగాలి జుమ్మని వీస్తోంది. ఆకాశంలో ఎక్కడా ఒక్కచుక్కయినా లేదు. ఆ నీలాకాశాన్ని, నల్లనిమబ్బులు కప్పేసి లోకాన్ని గాఢాంధకార బంధురంగా చేశాయి. వర్షపు నీరంతా- వరదవొచ్చినట్టు, చిన్న చిన్న కాలువలుగా ఎక్కడికో ప్రవహించి పోతూవుంది. మధ్యమధ్య గంభీరమైన ఉరుముల శబ్దానికి పసిపిల్లలు అదిరదిరి పడుతున్నారు. అప్పుడప్పుడు, మెరపు మెరసినప్పటి కాంతి ప్రవాహం మాత్రం భూమి మీద పడుతూవుంది.

దాదాపు అర్థరాత్రి సమయం. ఊళ్ళో అందరూ గాఢ నిద్రలో వున్నారు. బయట వాన చినుకులు చిటపటలు అమిత వేగంతో వీచేగాలి చెట్ల కొమ్మల్లోనుంచి దూసుకుపోతూ చేసే శబ్దమూ, కప్పల బెకబెకలూ- స్పష్టంగా వినిపిస్తున్నాయి.

వెంకడు తన పూరిగుడిసెలో, నులక కుక్కిలో, చిరిగిన కంబళి కప్పుకొని, ముడుచుకు పడుకున్నాడు. వెంకడికి ఆ సాయంత్రం బైరాగి చెప్పిన మాటలు - చలికన్నా బాధాకరంగా వున్నాయి.

పూర్వం రామిని తనకే యిస్తానన్న బైరాగిలో యీ ధనాశ ఎందుకు రేకెత్తిందో - వెంకడికి అర్థమవలేదు. ఈ ఆశ తండ్రీ కూతుళ్ల సంప్రదింపుతో వుందనే- వెంకడికి గట్టి నమ్మకం.

బైరాగి తనను రెండు వందల రూపాయ లడిగాడు. తన శక్తిని కూడా యోచించకుండా- కోరాడే! ఒకటా? రెండా? రెం-డు-వం-ద-లు! అంత ధనాన్ని తను ఎక్కడి నుంచి తెచ్చి యివ్వగలడు? అక్కడికీ తన దగ్గరవున్న యాభై రూపాయిలూ - తెచ్చి యిస్తానన్నాడు. దానికికూడా బైరాగి మనస్సు కరుగలేదు. "ఒక నెల రోజుల్లో రెండు వందలు- తెచ్చి రామి విషయం మాట్లాడు" అన్న బైరాగి ముక్కలు- వెంకడి చెవుల్లో ఇంకా గింగురుమంటూనే వున్నాయి.

తనకు ఏం తక్కువని రామిని తన కిచ్చేందుకు- బైరాగి సందేహిస్తున్నాడు? తను రెండువందలూ తెచ్చేందుకు- ముప్పై రోజులు గడువు! తన వాళ్లను ఎవరన్నా అప్పడిగి తెద్దామంటే- అసలు తన వాళ్లెవరు? చిన్నతనంలోనే తల్లిదండ్రుల్ని కోల్పొయ్యాడు. చిన్నతనంనుంచీ తనకు కష్టాలే! అందులోనూ తను జన్మించిన ఆ చాకలి కులంలో- తన నెవరు ఆదరిస్తారు? కరణంగారికి తన కుటుంబం మీద ఎంత విశ్వాసం! కరణంగారికి కలరా తగిలినప్పుడు- తన తండ్రి పుల్లాయ్- అందరూ దాపుకు పొయ్యేందుక్కూడా భయపడుతూవుంటే పుల్లాయ్ ఒక్కడే కరణంగారి దగ్గర కాపలాకూర్చొని ఆయనకు వెట్టిచాకిరీ చేశాడుట? ఆ సంగతి కరణంగారి యింట్లో

ఇప్పటికీ్కూడా చెప్పుకుంటారు. ఆరో యేటనుంచీ- తల్లిదండ్రుల్లేని అనాథ అయిన తనను ఆ కరణంగారు ఎంతో ప్రేమతో చూచాడు. కన్న కొడుకులాగ తనను ఆదరించాడు. తన చేత ఎంతో తక్కువగా పనిచేయించుకునేవాడు. కొనుక్కునేందుకు అప్పుడప్పుడు 'కాని' ఇస్తూ వుండేవాడు. ఆ కరణంగారు తనను అల్లా 15 సంవత్సరాలు చూచాడు. తన 21వ సంవత్సరంలో ఆ కరణం దొర ఇహలోకయాత్ర చాలించాడు.

నిజంగా- ఆ దెబ్బతో తను అథఃపతితు డవవలసింది! కాని ఆ కరణంగారి కొడుకు- ఆ ప్రకాశందొర- ఆయనెంత మంచివాడు! తండ్రి చూపిన ఆదరణంతా- యీ దొరకూడా తనకు చూపాడు. అల్లాటి తండ్రినిపోలిన కొడుకును, తను ఇదివరకు ఎక్కడా చూడలేదు. కరణంగారి యింట్లో తనను ఇంత ఆదరణతో చూస్తూ వుండబట్టే - ఇన్నాళ్ళూ తన కేకష్టమూ కలుగలేదు. కాని తన కిప్పుడు వచ్చిన కష్టాన్ని ఆర్చేవారెవరు?

గత 22 సంవత్సరాల్లోను గడచిన తన జీవితాన్ని తలుచుకొని, వెంకడు విచారించాడు.

రామి లేకుంటేనేం? తను ఇంకెవర్నన్నా వివాహమాడరాదా? కాని రామిని తను మనసారా ప్రేమించాడు. రామి కూడా తనను గాఢంగా వలచింది. రామి తనను 'బావా' అని నోరారా పిలిచినప్పుడు విని, తను ముగ్ధుడయ్యేవాడు. ఆమెను పెండ్లాడి తను సుఖిద్దా మనుకున్నాడు. కాని యీ ధనాశా పిశాచం తన ఆశయాల నన్నిటికీ ప్రతిబంధకమయింది. తను ఆ మనువుమీద ఎంత మనసుపడ్డాడో! తన నిర్భాగ్య జీవితంలో ఆ మనసైన మనువు అయితే, అదే తనకు పదివేలని తలచాడు. కాని ఆ అవకాశం ఇప్పుడేది?

వెంకడికి యేమీ పాలుపోవడం లేదు. పోనీ తన కరణంగారిని అడుగుతే? ఆస్తిపాస్తులులేని తనలాటి దౌర్భాగ్య దామోదరుడికి అప్పెవరిస్తారు? అందులోను- రెండువందల రూపాయిలు! ఆ ధనాన్ని సంపాదించే శక్తిని యే రూపంలోనైనా సరే భగవంతుడు తనకు ప్రసాదించి వుంటే- ఈ సమయంలో తన శక్తినంతట్నీ వినియోగించేవాడు. తన స్వాధీనంలో వున్నది.- దేన్నయినా సరే తను రామికోసం త్యాగం చేస్తాడు. కాని తనకు అతీతమైన యీ ధనాన్ని ఎక్కడనుంచి తెస్తాడు? కరణంగారిని అడిగేందుక్కూడా - ఒక విధంగా భయమే! అడుగుతే యేమనుకుంటారో? తప్పక నిరాకరిస్తాడు. అడిగికూడా ప్రయోజనం లేదు. వెంకడికి ఆ ఆశ కూడా అడుగంటింది. ఇంక ధన సంపాదనకు యేది దారి?

తను డబ్బుతో ప్రేమను సంపాదింప వలసి వచ్చింది. ఇది కొంతవరకూ, వెంకడికి రామి మీద వుండే మక్కువను తక్కువ చేసినా- చిరకాలంనుంచీ ప్రేమిస్తూవున్న

రామిమీద ప్రేమకు మాత్రం ప్రతిబంధక మవలేదు. ఎన్ని కష్టాలయినాపడి, రామిని చేసుకు తీరాలి. కాని ఎట్లా?

అనేక ఆలోచనలతో వెంకడు ఆ రాత్రి నిద్రకు దూరమైనాడు. ఎడతెరిపిలేకుండా వాన కురుస్తూనే వుంది. ఎడతెరిపి లేకుండా అనేక ఊహావ్యూహాలు వెంకడి మనస్సులో రేకెత్తుతూనే వున్నాయి. దాదాపు రాత్రంతా ఆలోచించినా- వెంకడికి ధన సంపాదనా సూక్ష్మమార్గం యేమీ గోచరమవలేదు.

తెల్లవారుజామునకు వాన ఆగింది. ఆ మేఘావృతమైన ఆకాశంవైపు చూచాడు- వెంకడు. ఎంత గంభీరంగా వుంది! అల్లాటి మేఘాలే తన జీవితాన్ని ఇప్పుడు అంటిపట్టుకున్నాయి. కాని, పెనుగాలి చేత ఆకాశంలోని ఆ మేఘాలు ఒక్కొక్కటిగా విడిపోతున్నాయి! మేఘాలు ఇంతసేపూ మరుగుపరచిన ఆ నీలాకాశంలోంచి, తెల్లని కాంతులు కన్పిస్తున్నాయి. తన జీవితంలోని యీ విషాదమేఘాలు కూడా- ఏ పెనుగాలైనా వీచి పటాపంచలవవా? ఏమో! తనకు అంత అదృష్టమా! వెంకడి మనస్సులో ఏ వూహకూ తావు లేకుండా వుంది. నాల్గవజామున కోడికూసిన కూత వెంకడికి, భయంకరంగా తోచింది.

## 4

తెల్లవారింది. ఎండ చాలాతీక్షణంగా వుంది. సూర్యుని ప్రచండ కిరణాలు- చెట్ల ఆకులుమీద, గడ్డి పోచలమీద నిలిచిన రాత్రి వానబాపతు నీటి బిందువులలో ప్రతిఫలించి, కన్నులు మిరిమిట్లు కొల్పుతున్నాయి. వెంకడు గొడ్లను పొలం తోలుకు పోతున్నాడు. తీక్షణమైన ఆ సూర్యరశ్మి అతనిలో యేమీ చలనం కలిగించటంలేదు. వెంకడికి ఆ పొద్దున కూడు కూడా సరిగ్గా సయించలేదు. పూర్వం, రామికి తనకూ జరిగిన సంభాషణలు జ్ఞాపకానికి వచ్చి, వెంకడి మనసును కలచివేస్తున్నాయి. వెంకడి భగ్నహృదయంలో బైరాగి ధనతృష్ణను తీర్చే వుపాయాన్వేషణా పర్యాయంగా తిరుగుతూ వుంది.

ఆ సాయింకాలందాకా కాలం ఎల్లా గడిపాడో వెంకడికే తెలియదు! సాయింత్రం గొడ్లను ఇల్లుజేర్చి తనుకూడా గుడిసె జేరుకున్నాడు. అతని మనస్సులో శాంతిలేదు. క్షణ క్షణానికి ఊహా సౌధాలు నిర్మితమయి ప్రచండ భూకంపం వల్ల పడిపొయ్యే సౌధాల్లాగు- నేలమట్టమవుతున్నాయి.

వెంకడు ఏకాంతంగా కూర్చొని రామికోసం ఏడ్చేవాడు. ఆ ఏడ్పు ప్రకృతిమాతకు తప్ప యీ లోకంలో ఇంకెవ్వరికీ వినిపించలేదు. వెంకడికి రామి ఆకారం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా- మనస్సులో ఆవేదన పుట్టేది. రాత్రులు నిద్రలేక కళ్ళు ఎర్రబడ్డాయి.

వెంకడు తనకుతను కూడా యే సమాధానమూ చెప్పుకోలేక పొయ్యేవాడు. అమితంగా దుఃఖించటంవల్ల- వెంకడి కళ్ళలోని కాంతి సగం తగ్గిపోయింది. వెంకడికి, అన్నం సరిగ్గా సయించక రోజురోజుకూ చిక్కిపోవడం మొదలుపెట్టాడు. వెంకడి మనస్సులోని ఆవేదన అతని ముఖంలో స్పష్టంగా కన్పిస్తూనే వుంది.

ఒకనాడు, కరణంగారు కూడా తనను ప్రశ్నించారు: "ఏరా వెంకా! రోజురోజుకూ చిక్కిపోతున్నావు?" వెంకడు లేని సంతోషాన్ని నటిస్తూ "ఏం లేదు బాబయ్యా!" అంటూ సర్దుకున్నాడు.

తను ఇంత కష్టపడుతూవున్నా కరణంగారు తప్ప, తనను వూళ్లో ఇంకెవ్వరూ 'ఎట్లావున్నావ్?' అని ప్రశ్నించే దిక్కుకూడా లేదు. వాడిన తన ముఖాన్ని చూచికూడా తన కష్టాన్ని గుర్తించే వ్యక్తి ఆ గ్రామంలో లేనందుకు వెంకడికి తనొక భూభారంగా తోచింది.

రామిని చూచి రెండు వారాలయింది. వెంకడికి పిచ్చి ఎక్కినట్టుగా వుంది. ఏ పని చేద్దామన్నా తోచేది కాదు. గొడ్లకు కుడితిపెట్టటం కూడా మఱచిపొయ్యేవాడు. గొడ్లు గడ్డికోసం అరుస్తే కోపంకొద్దీ వాటిని కొట్టేవాడు. మృదువైన వెంకడి హృదయంలో ఒక విధమైన కఠినత్వం ప్రవేశించింది.

ఇల్లా తను ఎన్నాళ్ళు మనోబాధకు గురవ్వాలో వెంకడు ఊహించుకోలేకుండా వున్నాడు. బహుశా నిష్కల్మష హృదయంతో రామిని ప్రేమించి, తిరస్కరింపబడ్డ తను యావజ్జీవమూ నిరాశాపిశాచి బాధతో కృంగిపోవలసి వుంటుంది. మనోబాధకు మందుకూడా లేదు! తన గడచిన కష్టాలన్నీ ఒక ఎత్తూ, నేటి క్లిష్టపరిస్థితి ఒక ఎత్తుగాను తోచింది వెంకడికి. తను యీ సంగతి ఎవరితో చెప్పుకుంటాడు? పొలంలో తను గుడ్లనీరు కుక్కుకుంటూ వుంటే కరణంగారి ఎఱ్ఱ ఆవు హృదయంవున్న వ్యక్తిలాగు, గడ్డి కొరకటం మాని, తన వైపు దీనంగా చూచి సానుభూతిగా తల ఆడించింది. అంతకు తప్ప తనకు సానుభూతి తెలిపేవారు యీ విశాల ప్రపంచంలో ఇంకెవ్వరూ లేరు! అదే ఏ గొప్పవారి కష్టమయినా అయితే వూరంతా వెల్లడవుతుంది. తన సంగతే ఎవరికీ పట్టలేదు. ఊళ్లో అందరూ సంతోషంగా వున్నారు. తనొక్కడే ఏ ఆనందానికీ నోచుకో లేదు. తన జన్మవృథా! ధనంలేని వ్యక్తి యీ లోకానికి బరువు! ధనహీనుడి కన్న దౌర్భాగ్యుడు లేడే! ఏ విషయంలోనూ తను కొరగాని వాడయ్యాడు! లోకం ఎంత స్వార్థమైనది! తమ సుఖమేకాని ఎదుటివాని కష్టాన్నయినా గుర్తించదే! వెంకడు తన భావి జీవితమంతా అంధకార బంధురమనుకున్నాడు. కాని తనకు ఎప్పటికన్నా ఆశ వుందా? ఏమో! ఎవరు చెప్పగలరు?

## 5

సూర్యాస్తమయ సమయం. ఆకాశం వన్నెవన్నెల మబ్బులతో అలంకరింపబడివుంది. ఆ పచ్చని చేల మీది నుంచి వచ్చే చల్లనిగాలి అలసిన ప్రాణాలకు అమృతధారగా వుంది. పొలం వెళ్ళిన గొడ్లు, మందలు మందలుగా ఇళ్లకు మరలివస్తున్నాయి. లేగదూడలు ఎక్కడలేని సంతోషంతోనూ తోకలు పైకెత్తి ఎగిరెగిరి దూకుతూ తమ తల్లుల ప్రక్కగా నడుస్తున్నాయి. దూడల దూకులకు రేగిన ఇసుక రేణువులు సూర్యరశ్మిలో ఎగురుతూ, చిన్నచిన్న ధూళి మేఘాల్ని తాత్కాలితంగా సృష్టిస్తున్నాయి. పిల్లలు పొలంవెళ్ళిన తమ తండ్రుల రాకకోసం ఎదురుచూస్తూ వీధుల్లో ఆడుకుంటున్నారు. అమ్మలక్కలందరూ, బిందెల్ని చంకలపెట్టుకొని రాత్రికి కావలసిన నీటి కోసం, చెరువుకు వెళ్తున్నారు. పక్షులన్నీ కిలకిలారావాలతో గూళ్ళను చేరుకుంటున్నాయి.

ఇంత రమణీయమైన దృశ్యమూ అందరికీ కన్నుల పండువగా వుంటే, వెంకడిలో మాత్రం ఏమాత్రమూ, చలనాన్ని కలిగించలేకపోయింది.

ఇంకొక్క వారం రోజుల్లోపుగా వెంకడు, రెండు వందల రూపాయిల్నీ బైరాగికి ఇస్తే తప్ప రామి తనకు దక్కదు. మనసైన మనువు మంటి పాలవుతుంది. రోజులు గడిచిన కొద్దీ వెంకడికి ఆదుర్దా ఎక్కువవుతూవుంది. కాని ఏం చేస్తాడు?

గొడ్లను ఇల్లు జేర్చాడు. వాటి పాలుపిండి వాటికి కుడితిపెట్టి, గడ్డివేసి, గొడ్లపని పూర్తిచేసుకున్నాడు వెంకడు.

లాంతర్లు వెలిగించి, కరణంగారి పడకగదిలో లాంతరు పెట్టేందుకు వెళ్ళాడు. ఆ గదిలోని కరణంగారి ఇనుపపెట్టె వెంకడి కళ్ళపడ్డది. ఆశ్చర్యం! ఆ ఇనుపపెట్టె తలుపు తెరిచేవుంది. పెట్టెలోని సొరుగుల్లోవున్న కరెన్సీనోట్ల కట్టలూ, రూపాయిలూ చూస్తే వెంకడి కళ్ళు తిరిగిపొయ్యాయి. తనను ఇన్నాళ్ళుగా బాధించి, తన మనస్సును పీల్చి పిప్పి చేస్తూవున్న ధన సంపాదన ఇప్పుడెంత సులభం? ఆ సొరుగుల్లో వున్న డబ్బు, అదంతా తన కెందుకు? తన జీవితానికి కావలసింది రామి. రామికోసం రెండు వందలే చాలు! కాని తను ఆ రెండు వందలూ సంపాదించే విధానం?... దొంగతనం! తనను చిన్ననాటినుంచీ ఎక్కువ మక్కువతో పెంచి పెద్దవాణ్ణి చేసిన కరణంగారి ఇంట్లోనే దొంగతనం! ఇంటతిని ఇంటివాసాలు లెక్కపెట్టటమా? తను పట్టుపడితే శ్రీకృష్ణ జన్మస్థానాన్ని కూడా దర్శింపవలసి వుంటుంది! విశ్వాస విహీనంగా నమ్మిన యజమానికి ద్రోహం చెయ్యాలి. 'ఛీ' అనుకున్నాడు వెంకడు.

'ఆశ' అనేది మానవహృదయాన్ని వదలదు. అందులోనూ ధనాశ మానవునకు సహజం. ఎంతటి పనుల్నయినా చేయించగలదు.

వెంకడు మళ్ళీ ఆలోచించాడు. ఈ సదవకాశం పోతే తనకు ధనసంపాదన అసాధ్యం! తన రామికి తన మనసైన మనువుకు తను నోచుకోబోడు! 'దొంగతనం' అనేమాట వెంకడి చెవుల్లో మారుమ్రోగుతూవుంది. వెంకడికి నఖశిఖ పర్యంతమూ కంపించింది. అతని కళ్లు తిరిగిపోతున్నాయి. గదిలో వున్న ప్రతివస్తువూ, ప్రతినీడా తననే పరీక్షిస్తూ వున్నట్టుగా వుంది. కరణంగారు ఇంట్లో లేరు. కరణంగారి భార్య మడిగట్టుకుంది. కాని, తను దొంగిలిస్తూ వున్న సమయానికి ఎవరైనా వస్తే? ఏమయినాసరే ఈ అవకాశంపోతే నీకు తరుణోపాయం లేదని అతని మనసు నొక్కి వక్కాణిస్తోంది. లోపల ఉద్దేశ్యం వున్నా వెంకడు బాహ్యంగా అంతపనీ చేయలేక పోతున్నాడు.

వెంకడికి రామి తలపుకు వచ్చింది. తన రామి కోసం తన ప్రేమరాశికోసం తను యీ విధంగా డబ్బు సంపాదించటం దొంగతనమయినా దొరతనమయినా వొకటేనని వెంకడు నిశ్చయించుకున్నాడు. తను చేయరాని పని చేసినాసరే రామిని వివాహమాడగలడు. అదే తనకు కావలసింది! ఎంత ధైర్యాన్ని చెప్పుకున్నా కాళ్ళు వణుకుతూనే వున్నాయి. ఆ గదిలోని దీపం వెలుగులో కన్పిస్తూవున్న నీడలు కూడా వెంకడ్ని భయపెడుతున్నాయి. వెంకడి గుండె అమితవేగంగా కొట్టుకుంటూవుంది. అతనిలోని రక్తమంతా ఘనీభవించినట్టు ఒక్క అంగమూ సరిగా స్వాధీనంలో లేకుండా వున్నాయి.

వెంకడు లేని ధైర్యం తెచ్చుకున్నాడు. బలవంతాన వెనక్కులాగే ప్రతిఅంగాన్నీ స్వాధీనం చేసుకునేందుకు శక్తినంతట్నీ వుపయోగించాడు. ఒణుకుతూవున్న చేతులతో మొదటి సొరుగులోని రెండు నోట్లకట్టల్ని తీశాడు. అక్కడ ఇంకా చాలావున్నాయి. అవన్నీ తనకు అనవసరం! ఆ కట్టల్ని అతికష్టంమీద బొడ్డునదోపాడు.

ఆ గదిలోనుంచి హాలులోకి వచ్చే దాకా వెంకడి గుండెల్లో గుండెలులేవు. హాలులోకి వచ్చినా వెంకడికి ఒణుకు తగ్గిందికాదు. తొట్రుపడుతూవున్న మాటల్తోనే కరణంగారి భార్యతో చెప్పాడు, "అమ్మా! నేనెల్తా."

"సరే వెళ్ళు" అంది కరణంగారి భార్య. తను చేసిన వెధవపని ఆమెకేం తెలుసు?

ఒణుకుతూవున్న కాళ్ళతోనే వెంకడు బజార్లోపడ్డాడు. వెంకడికి బజార్లో నడుస్తూవున్న ప్రతివ్యక్తి తనను అనుమానిస్తూ వున్నట్టే తోచింది. అతనికి కనిపించే ప్రతివస్తువూ అతన్ని భయపెడుతూనే వుంది. ఎల్లాగో గుడిసె జేరుకున్నాడు. అన్నం తినబోతే సయించలేదు.

మంచంమీద నడుం వాల్చాడన్నమాటే కాని వెంకడి మనసుల్లో మనసులేదు. తనుచేసినపని తల్చుకున్నప్పుడల్లా అతని హృదయతంతుల్లో "యజమానికే ద్రోహం!" అనే ముక్కలు మారుమోగుతున్నాయి.

ఇందాకటి దృశ్యం ఆ గది, ఆ ఇనుపపెట్టి, తను ఒణికే చేతులతో, ఇనుప పెట్టిసొరుగులోని నోట్లకట్టల్ని తియ్యటం, ఎట్లాగో వాటిని బొడ్డున పెట్టుకోవటం ఇవన్నీ జ్ఞాపకానికి వచ్చాయి. వెంకడు తను భ్రమిస్తున్నానేమో ననుకున్నాడు. వెంటనే బొడ్డు తడివి చూచాడు. రెండు నోట్లకట్టలూ అల్లాగే వున్నాయి. తీసి లెక్కించాడు. సరిగ్గా రెండువందల రూపాయిలు! ఆ నోట్లను చూస్తూవుంటే వెంకడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ నోట్లతో పూర్వం తన తీరనికోరిక 'తీరినకోరిక'వుతుంది. క్షణకాలపు పనితో తను, అసాధ్యమనుకొన్న రామిని తిరిగి పొందగలిగే అవకాశాన్ని చూడగలిగాడు. ఎంతలో 'నిరాశ' 'ఆశ'గా పరిణమించింది!

కాని, తను చేసింది ఎంత ఘోరమైన పని! విశ్వాసంగా పనిచేస్తూ, తను నమ్మినయజమానికే తను ద్రోహంచేశాడు! తనను చిన్ననాటినుంచీ పెంచినవారికి తను ఇల్లాటిపని చేశాడే! వెంకడిలో తర్జన బయలుదేరింది. ఇప్పుడువెళ్ళి ఆ డబ్బు, కరణంగారికిచ్చి, ఆయన పాదాలు పట్టుకుంటే తనను క్షమించవచ్చు!

కాని వెంటనే వెంకడికి రామి జ్ఞాపకం వచ్చింది. తను రామి ప్రేమ కోసమే ఇంతపనీ చేశాడు. ఆ ప్రేమే తనను యజమానిదెస విశ్వాస విహీనుడుగా ప్రవర్తించేందుకు తావిచ్చింది. ప్రేమకు ఎంతశక్తి వుందో వెంకడికి, ఇప్పుడు బాగా అర్థమయింది. మనసైన మనువని బుద్ధిపూర్వకంగా కాకపోయినా అవసరాన్నిపట్టి తను ఇంతటి పనికి సాహసించాడు.

రామికోసం ఇంతపనీచేసి ఇప్పుడు మళ్ళీ తన తప్పును దిద్దుకో ప్రయత్నించటం, తనకు శ్రేయస్కరం కాదు. కరణంగారికి తన దొంగతనాన్ని తనే బహిరంగపరుస్తే కరణంగారికి కోపంవచ్చి తనను ఇంటినుంచికూడా వెళ్ళగొట్టవచ్చు. పరిస్థితులు ఎల్లామారుతయ్యో వెంకడికి అర్థమవలేదు. తనను కరణంగారు పిలిపించి... అడుగుతే? తనకేమీ తెలియదని సమాధానం చెప్దామని వెంకడు నిశ్చయించుకున్నాడు. కాని తన అంతరాత్మ 'నువ్వే దొంగవు' అని ఘంటాపదంగా వాదిస్తూనే వుంది. నిద్రపోయి జరిగినదంతా మర్చిపోదామనుకున్నాడు. కాని నిద్రరాదే! వెంకడు ఆకాశంలోకి చూచాడు. అప్పుడే అస్తమించబోతూవున్న చంద్రుడు, వెంకడ్ని చూసి వెకిలినవ్వొకటి నవ్వాడు.

## 6

ఏ క్షణాని కాక్షణమే దొంగతనం విషయం తనను అడుగుతారేమోనని వెంకడికి భయంగానే వుండేది. కరణంగారి ఇంట్లో పనిచేస్తూవున్నంతసేపూ వెంకడికి గుండెల్లో గుండెలుండేవేకాదు. ఎంత ధైర్యం తెచ్చుకున్నా ఆ కాళ్ళలో గజగజ, మాటల్లో తొట్రుపాటూ పోనేలేదు. సాధ్యమైనంత త్వరగా కరణంగారి ఇంట్లో పని పూర్తి చేసుకొనేవాడు వెంకడు.

ఒక వారం గడిచింది.

కరణంగారి ఇంట్లో డబ్బుపోయిన ప్రస్తావనే రాలేదు. ఇంక డబ్బు సంగతి తననెవరూ అడుగబోరనీ, ఆ డబ్బును తన స్వంతడబ్బులాగ నిరభ్యంతరంగా వాడుకోవచ్చుననీ వెంకడికి ధైర్యం వచ్చింది. కరణంగారి ఇంట్లో వ్యవహారాలన్నీ పూర్వంలాగే మార్పేమీలేకుండా, సక్రమంగా సాగిపోతున్నాయి. తనకు కూడా పూర్వపు ఆదరణేవుంది కాని తను వారికి ద్రోహం చేసిన సంగతి వారికేం తెలుసు! పాపం! వారెంత అమాయకులో!

ఆనాడు సాయంత్రం, నూతనోత్సాహంతో, వెంకడు రామి ఇంటికి వెళ్ళాడు. వెంకడ్ని చూడంగానే బైరాగి అడిగాడు. "ఎరా ఎంకా! మళ్లీ వచ్చావేం?"

"మామా! రెండు వందలూ యిస్తె రామిని నాకు ఇస్తావా" వెంకడు దీనంగా అడిగాడు. "ఆ" అంటూ బైరాగి తల వూపాడు.

"ఇత్తానుకాని పెల్లి ఎప్పుడుసేస్తావ్?"

"లగ్గం చూచుకొని చేచేత్తాను."

"మామా! చాలా కట్టపడి తెచ్చాను. పిచ్చికలపాడులో మా బందుగులుంటే - వార్ని అప్పడిగి తెచ్చామామా!"- వెంకడు, ఆ నోట్లకట్టను బైరాగిచేతికి అందిచ్చాడు.

బైరాగి వాటిని లెక్కించాడు.

"శెబాస్! నువ్వే రామికి తగినోడివిరా! వచ్చేవారంలో లగ్గంచూచి- పెల్లిచేచేత్తాను" -బైరాగి అన్నాడు సంతోషంతో.

డబ్బులో ఎంత మహత్యంవుంది. డబ్బుతెస్తే తను రామికి తగినవాడట! లేకపోతే ఎందుకూ పనికిరాని వెధవే! తను బొంకాడు చాలా కష్టపడితెచ్చిన డబ్బుని బైరాగితో చెప్పాడు- రెండు నిమిషాలు కష్టపడితెచ్చిన డబ్బు!

ఇంక రామి తనది! తన భార్య! తను యావజ్జీవమూ దాంతో హాయిగా కాలంగడుపవచ్చు! తన జీవితాశయం నేటికి నెరవేరింది! రామి! తను ప్రేమించిన రామి! ఒక వైపు ద్రోహం - మఱోవైపు ప్రేమ ప్రవాహం! ఒకవైపు మనోబాధ మరోవైపు జీవితసాఫల్యం! ఆ మరువారంలో - గురువారం నాడు- వివాహలగ్నం పెట్టబడ్డది.

వెంకడు, తన పెళ్ళి సంగతి కరణంగారికి చెప్పాడు. కరణంగారు, బట్టలు కొనుక్కోమని వెంకడికి ఇరవై రూపాయలిచ్చారు. తను వారింట్లో రెండువందలూ అపహరించాడు! అయినా తన మీద దయ చూపుతూనే వున్నాడు. ఎంత విశాల హృదయుడు! ఎంతమంచి యజమాని! అట్టి సత్పురుషుడికేనా తను ద్రోహం చేయవలసింది? వెంకడి ఆత్మ ఘోష పెట్టింది. ఆవు ఏదో బాధతో 'అంబా' అని అరిచింది.

# 7

వివాహానంతరం, వెంకడి జీవితంలో నూతనశకం ఆరంభమయింది. తన పూర్వపు ఆశలన్నీ మళ్ళీ చిగిర్చాయి. రామిని వివాహమాడి తన జన్మసఫలమయిందని వెంకడు, ఎంచుకున్నాడు. పూర్వం రామి వల్ల ఎంతగా సుఖిద్దామనుకున్నాడో అంతసుఖాన్నీ ఇప్పుడు, వెంకడు ఆఘ్రాణించగలుగుతూవున్నాడు. అతని జీవితంలోని మధురక్షణాలవి. వెంకడు సంసారజీవితంలో ఎంత సుఖముందో ననుకొనేవాడు.

ఈ సుఖమంతా తనకు రామివల్ల కలిగిందా? లేక ధనం వల్లనా? అని వెంకడికి అనుమానం. తనకు డబ్బు దొరక్కపోతే రామి లభ్యమయ్యేదికాదు. కాబట్టి డబ్బువల్లనే యీ సుఖమంతానని వెంకడికి గట్టి నమ్మకం. డబ్బు సంగతి జ్ఞాపకం వచ్చినప్పుడల్లా వెంకడికి రోమరోమమూ చలించేది.

తను చేసిన పాపానికి ప్రతీకారం లేదని వెంకడనుకునేవాడు. తనను నమ్మిన యజమానికే తను ద్రోహం చేశాడే! ఎంగిలికూడు తినే కుక్కకు వున్నమాత్రపు విశ్వాసంకూడా మానవుడైన తనకులేదే! కరణంగారి ఋణం తను ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోగలడా?

రాత్రులు, వెంకడు, నిద్రలో కలవరించేవాడు! "ద్రోహం చేశాను, క్షమించండి" అని. రామి ఉలిక్కిపడిలేచి, 'ఏమిట'ని అడిగేది. ఏం లేదని వెంకడు సమాధానం చెప్పేవాడు. రామి నిశ్చింతగా నిద్రపొయ్యేది.

వెంకడు పశ్చాత్తాపపడేవాడు, రామి ముఖం చూచేవాడు. దానికోసమే తను దొంగతనం చేయవలసి వచ్చింది. అప్పుడు పట్టుబడ్డట్టయితే తను గోదావరీ స్నానానికి వెళ్లేవాడు. ఆ సమయాన రామి తనకు సానుభూతన్నా చూపేది కాదు. వెధవప్రేమ! ఎంతటి ఘోర కృత్యాల్నయినా సులభంగా చేయిస్తుంది! తన జీవితాన్ని తన వంశానికికూడా కళంకం తెచ్చిన ప్రేమ! తను పశ్చాత్తాప పడేవాడు, ఏడ్చేవాడు. రామి కిదేమీ పట్టనట్టు సుఖంగా నిద్రపొయ్యేది.

వెంకడు, ఒకనాడు, ఆవేదనతో రామితో అన్నాడు: "రామీ నీ కోసం ఎంతపని చేయాల్సొచ్చిందే?"

"ఏం చేశావు బావా!" రామి అడిగింది, అమాయకంగా.

చేసిన పనినిచెప్పి, కొంత హృదయభారాన్ని తాత్కాలితంగా తప్పించుకుందామని వెంకడు తలిచాడు. కాని, రామి కీ సంగతి చెప్పికూడా లాభం లేదనుకున్నాడు. తనొక్కడే ఆ బాధనంతనూ అనుభవించేందుకు అర్హుడ్నని వెంకడు నిశ్చయించుకున్నాడు.

వెంకడు ఏదో ఆలోచిస్తున్నాడు. "ఏం చేశావు బావా?" రామి తిరిగి ప్రశ్నించింది. అర్థంకాని చూపులతో.

"ఏంలేదే పిల్లా ఎకతాలికన్నాను" వెంకడన్నాడు, లేని నవ్వును నటిస్తూ. "పోనీలే నాతో చెప్పకపోతే" రామి కోపంతో మూతిముడిచింది.

"ఏంలేదే పిల్లా అంటే మళ్లీ అడుగుతావేం?" అన్నాడు వెంకడు రామిని ముద్దుపెట్టుకుంటూ.

"ఊఁ" అని దీర్ఘం తీసింది రామి. వెంకడు యేమీ మాట్లాడలేదు.

ఇల్లా ఒకటి రెండుసార్లు తన దొంగతనాన్ని రామికి చెప్దామనుకొన్నాడు వెంకడు, కాని నోటిదాకా వచ్చేమాటల్ని గొంతులోకే దిగమింగుకొని, సంభాషణను మార్చేవాడు.

ఆ కరణంగారిని చూచినప్పుడల్లా వెంకడికి ఎక్కడలేని దుఃఖమూ వచ్చేది. కరణంగారికి తన ముఖం చూపేందుక్కూడా వెంకడికి మనసొప్పేదికాదు.

కాలచక్రంలో దినాలు దినాలుగా తిరిగిపోతున్నాయి. కాని వెంకడి మనస్సులోని తుపానుకు మాత్రం శాంతి లేదు. కరణంగారి ఋణాన్ని తీర్చాలనే వుద్దేశ్యం వెంకడికి వుంది. కాని ఎట్లా?

## 8

మూడు సంవత్సరాలు గడిచాయి. బైరాగి చనిపొయ్యాడు. వెంకడికి ఒక కొడుకు, వాడికి 'బైరాగి' అని పేరుపెట్టాడు వెంకడు. భార్యతోనూ, కొడుకుతోనూ బాహ్యంగా సంతోషంగా వున్నా, అతని ఆంతరంగిక బాధ మాత్రం తగ్గింది కాదు.

ఆనాడు సాయంత్రం, మామూలుగా వెంకడు గొడ్లను తోలుకొని, కరణంగారింటికి వచ్చాడు.

కరణంగారు దొడ్లో నిలవబడి, "వెంకా!" అని కేకవేశారు.

"వస్తున్నా బాబయ్యా!" అంటూ వెంకడు పరుగెత్తుకు వచ్చాడు.

"ఎంత అదృష్టవంతుడివిరా వెంకా!"

"ఏం బాబయ్యా?" వెంకడడిగాడు, తనకేమీ అర్థమవనట్టు చూస్తూ.

"నీ పేర లాటరీ వేస్తే నాలుగువందల రూపాయిలు వచ్చాయిరా!"

"నాకా బాబయ్యా?" వెంకడు ఆశ్చర్యపొయ్యాడు.

"నీకేరా!"

"నాకే?" వెంకడి అనుమానం ఇంకా తీరలేదు.

"అవునురా" కరణంగారు నొక్కినొక్కి చెప్పారు.

రెండునిమిషాల పాటు వెంకడు తను ఎక్కడవున్నదీ తెలుసుకోలేకపొయ్యాడు. తనకు నాలుగు వందలు! తను కలలో కూడా తలవని విషయం! కాలచక్రంలో అసంభవమూ అసాధ్యమూ అయిన విషయాలు కూడా సంభవమూ, సాధ్యము అవుతున్నాయి! వెంకడికి దొడ్లోవున్న బాదంచెట్టూ, నుయ్యీ, పందిరీ, కరణంగారూ, అన్నీ గిర్రున తిరుగుతూ వున్నట్టు తోచింది.

"ఇదిగో తీసుకోరా" కరణంగారు నోట్ల కట్టను వెంకడికి అందిస్తున్నాడు.

కరణంగారికి తన మీద ఎంత, ఆదరణాభిమానాలు! తనకు తెలియకుండా తన పేర వేసిన లాటరీలో వచ్చిన డబ్బును తనకే ఇస్తున్నాడు. ఈ లోకం అంతా స్వార్థపరులమయమని వెంకడొకసారి నమ్మాడుకాని తాను పొరపడ్డాడు. యీ పాప భూయిష్ఠ ప్రపంచంలో కూడా అన్నికాలాల్లోనూ త్యాగులు వున్నారు! ఇదే తనకు ప్రత్యక్ష నిదర్శనం. ఇంతకన్న మహాపురుషుణ్ణి, వెంకడు తన జీవితంలో చూడబోడు! కాని ఇల్లాటి పుణ్యమూర్తికేనా తానిదివరలో ద్రోహంచేసింది! తనలాటి పాపి యీ లోకంలో మరొకడు వుండడు! తన పాపానికి తనను శిక్షించేందుకు యమదండనచాలా? వెంకడి కళ్ళనీళ్ళు తిరిగాయి, కరణంగారి ముఖంలోకి చూచాడు. ఎంత నిశ్చలంగా వుంది! ఎంత ప్రశాంతదృక్కులు!

వెంకడు, కరణంగారిపాదాల్ని గట్టిగాపట్టుకొని పిల్లవాడిలాగు వెక్కివెక్కి ఏడ్చాడు. వెంకడి కన్నీటిధారలతో కరణంగారి పాదాలు తడిసాయి.

"వెంకా! ఏమిటిది?" కరణంగారు అడిగారు, విషయం ఏమీ బోధపడనట్టుగా.

పొంగిపొరలివస్తూవున్న దుఃఖాన్ని ఆపుకుంటూ వెంకడు సమాధానం చెప్పాడు. "బాబయ్యా! నన్ను క్షమించానంటేకాని మీ పాదాలు వదలను."

"వెంకా! నువ్వేం తప్పుచేశావు?"

"ముందు క్షమించండి బాబయ్యా!"

"సరే క్షమించాను, తప్పేమిటో చెప్పు వెంకా!"

"బాబయ్యా! ఈ నాలుగువందలూ మీరే వుంచుకోండి నాకు వద్దు." వెంకడికి డబ్బు మీద పూర్తిగా విరక్తి పుట్టింది.

"వెంకా! నేనే యీ డబ్బును వుంచుకోవాలనుకుంటే నీకీసంగతి చెప్పేవాణ్ణేకాదు."

"కాని బాబయ్యా నేను మీకు బాకీ."

"నాకా? ఎందుకు? ఎప్పుడు?" కరణంగారు ఆశ్చర్యంతో అడిగారు.

"బాబయ్యా! నా పెళ్ళికి..." వెంకడికి అమిత దుఃఖం వల్ల నోట మాటలు రావటంలేదు.

"అవును; వెంకా! రెండువందలు తీసుకున్నావు" కరణంగారు వాక్యశేషాన్ని పూరించారు.

వెంకడికి ఆశ్చర్యమయింది. తన దొంగతనాన్ని వెలిబుచ్చకమునుపే కరణంగారికి ఎల్లా తెలిసింది? లేక, ఆయనకు తెలిసిన విషయమే అయితే తనను పూర్వమే ఎందుకు అడుగలేదు?

"బాబయ్యా! నన్ను శిక్షించండి. నేనే డబ్బు దొంగిలించాను. దొంగను" వెంకడు వెక్కి వెక్కి యేడుస్తున్నాడు.

"వెంకా! ఆ సంగతి నాకు తెలుసు, నువ్వు డబ్బు తీసుకున్న వెంటనే నాకు తెలిసింది. అంతడబ్బు అక్కడ వుండగా నువ్వు రెండువందలే ఎందుకు తీసుకున్నావో చూద్దామని నిన్ను అడుగలేదు. తరువాత నిన్ను అడిగి నీ మనస్సు నొప్పించాలని నాకు లేదు. వెంకా! ఆ సంగతిని పూర్తిగా మరిచిపొయ్యాను. నువ్వు ప్రేమ వల్లనే రెండువందలూ దొంగిలించావు. నువ్వు దొంగవుకాదు వెంకా! దొంగవయితే డబ్బంతా తీసుకుపోవలసింది. నువ్వు నీ ప్రేమ పూజారిణికి అంకితమిచ్చేందుకు ఆ డబ్బును దొంగిలించావు. కాని... వెంకా!... నన్నడుగుతే నే నివ్వనూ?" ... కరణంగారు తగ్గుస్థాయిలో అడిగారు.

"బాబయ్యా! నా బుద్ధి గడ్డితిన్నది.. మీ మనస్సు గుర్తించక ఆ పనిచేశా బాబయ్యా! ఎన్ని జన్మాలు, కుక్కలై తమ ఇల్లు కాచినా నాకు శిక్షచాలదు. మనసైన మనువని ఇంత ఘోరంచేశా బాబయ్యా!" వెంకడి కన్నులవెంట ధారలుగా నీరుకారుతూవుంది.

"నీ బుద్ధి నాకు తెలుసు వెంకా! నీ పశ్చాత్తాపమే నువ్వు చేసిన నేరానికి శిక్ష; నీ విశ్వాసం నాకు తెలుసు కాబట్టే నిన్నింతగా ఆదరిస్తున్నాను. ఈ డబ్బు తీసుకుపోయి సుఖంగా వుండు."

"నేను మీ డబ్బు ముట్టలేనుదొరా! నేను చేసిందే ద్రోహం! నా పాడు ముఖాన్ని కూడా మీకు చూపలేను. మీ పాదధూళిని నేను ధరిస్తే ఆ ధూళికూడా మలినమై పోతుంది, బాబయ్యా!"

"వెంకా! కలతపడక యీ డబ్బు తీసుకో."

"ఒద్దు బాబయ్యా మీరే తీసుకోండి."

"సరే నేనే తీసుకున్నాను. కాని వెంకా! నీ కొడుక్కు దీన్ని బహుమానంగా ఇస్తున్నాను. తీసుకో."

"ఒ-ద్దు-బా-బ-య్యా!"

"వెంకా తీసుకో!"

వెంకడు యజమానిమాటను కాదనలేకపొయ్యాడు. ఒణుకుతూవున్న హస్తాల్తో డబ్బు తీసుకున్నాడు.

"వెంకా దుఃఖించవద్దు సుఖంగా వుండు."

"బాబయ్యా మీ సేవచేసి తరిస్తాను."

"వెం-కా!" కరణంగారన్నారు, సానుభూతిగా.

"బా-బ-య్యా!" అని వెంకడు, కరణంగారి పాదాల మీద పడ్డాడు.

'బాబయ్యా!' అని ప్రకృతి, ప్రతిధ్వనించింది.

పెనుగాలివల్ల, బాదంచెట్టు పువ్వులుకొన్ని రాలాయి.